
వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 278 | శుక్రవారం | 17 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# న్యాయం చేయండి



వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి నార్లవాయి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా తాడి చెట్టును నరికిన సింగారెడ్డి కుమారస్వామిపై ఎక్సైజ్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని గీత కార్మికుడు మడత శ్రీనివాస్ కోరారు. తాడి చెట్టునుంచి వచ్చే కల్లును అమ్ముకొని జీవనోపాధి పొందుతున్న తనకు నేడు ఉపాధి కరువై రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.
-వరంగల్ వాయిస్, సంగెం



వివరాలు 2లో..

# అకాల వర్షం.. అన్నదాత ఆగం

- చేతికందే వేళ నేలకొరిగిన వరి పంట
- ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఈదురు గాలులకు పలు ఇల్లు ధ్వంసం
- మరో నాలుగు రోజుల వర్ష సూచన
- ఆందోళనలో అన్నదాత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అకాల వర్షాలు అన్నదాతను ఆగం చేస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షంతో అన్నదాతలు ఆగమయ్యారు. రైతన్నల కళ్లముందే కోతకొచ్చిన వరి చేలు నేలవాలుతుండగా.. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవుతుంటే జీర్ణించుకోలేని రైతుల గుండెలవిసిపోతున్నాయి. చేతికొచ్చిన పంటను చూసి సంబురపడాలో.. అకాల వర్షంతో పంటంతా పాడవుతుంటే ఏడవాలో బోధపడని పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు ప్రారంభం కాకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. వరి కుప్పల కింద పెద్ద మొత్తం నీరు చేరింది. సరిపడ టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో పంట నష్టం తీవ్రంగానే ఉంది. వరి కుప్పలపైనే ధాన్యం మొలకెత్తడంతో ఆయా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలు స్తంభించగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో ఇండ్ల పై కప్పులు ఎగిరిపోయాయి. పంట కోత దశలో ఉన్న సమయంలో ఈదురు గాలులు, వడగండ్లతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. పంటను రక్షించుకోవడానికి వారు పడుతున్న యాతన చూస్తుంటే ఎవరి గుండె అయినా తరక్కుపోవాల్సిందే.. - వరంగల్ వాయిస్, మల్హర్



7లో..

# ప్రశ్నించే గొంతుక రాకేశ్ రెడ్డి

- ఎమ్మెల్సీ ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్
- సిట్టింగ్ స్థానాన్ని గెలిచేందుకు కసరత్తు
- రంగంలోకి కేసీఆర్, కేటీఆర్ | గెలుపే లక్ష్యంగా కారు జోరు



8లో

# హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

- నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయండి
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో
- పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష



8లో

# రాష్ట్రంలో ఇక బీజేపీ ప్రభుత్వమే

- పట్టభద్రుల ఓట్లతోనే దానికి నాంది
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకట రమణ రెడ్డి







# అకాల వర్షం.. అన్నదాత ఆగం

**చేతికందే వేళ నేలకొరిగిన వరి పంట**

**ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం**

**ఈదురు గాలులకు పలు ఇల్లు ధ్వంసం**

**మరో నాలుగు రోజుల వర్ష సూచన**

**ఆందోళనలో అన్నదాత**

**వరంగల్ వాయిస్, మల్హర్ :** కష్ట జీవి రైతన్న పై వరణుడు పగ పట్టాడు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఈదురు గాలులు, వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో చేతికి అందే దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. గత నాలుగు రోజులుగా రాత్రి వేళల్లో ఈదురు గాలులతో వర్షం కురుస్తుండటంతో పంట పొలాల్లో ఉన్న వరి కోయడానికి వీలు లేకుండా నీళ్ళలో మునిగిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం ఆరబోయడానికి వీలు పడక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రంగు మారిన ధాన్యం..

మరో వైపు వరి ధాన్యం రాశుల కింద భాగంలో నీరు చేరడంతో ధాన్యం రంగు మారగా మరి కొన్ని ప్రాంతాల్లో వరి ధాన్యం మొలకెత్తింది. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో కావాల్సినన్ని టార్పాలిన్ లు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తమ వద్ద ఉన్న పరదాలను ధాన్యం రాశులపై కప్పినప్పటికి భారీ వర్షం, ఈదురు గాలుల తాకిడికి అవి చెల్లా చెదురుగా ఎగిరిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

### 40 శాతమే కొనుగోళ్లు..

గత కొన్ని రోజులుగా అధికారులు పార్లమెంట్ ఎన్నికల విధుల్లో ఉండటంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై పర్యవేక్షణ కరువైంది. మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 40 శాతం కూడా వరి ధాన్యం కొనుగోలు జరగలేదు. దీంతో ఎక్కడ చూసినా వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలే దర్శనం ఇస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్ లు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.








### నగరంలోనూ ఇదే పరిస్థితి..

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** నగరంలో కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి. కాశీబుగ్గ పరిధిలోని వివేకానంద కాలనీ, సాయి గణేష్ కాలనీ, గాంధీనగర్ ప్రాంతాలు నీట మునిగాయి. పలువురి ఇండ్లలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. పొంగిపొర్లిన డ్రైనేజీలతో రహదారులు చెరువులను తలపించాయి. దీంతో వరంగల్ తూర్పు శాసనసభ్యులు, దేవదాయ శాఖ, అటవీ శాఖ, పర్యాటకశాఖ, మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు గురువారం 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ సహాయ చర్యల్లో పాల్గొన్నారు. మునిసిపల్ అధికారులతో చర్చించి వెంటనే వరద నీరు బయటకు పోయే విధంగా కృషి చేశారు. జేసీబీతో కాల్వ తీయడం ద్వారా వరద ముంపు తప్పింది. విరిగి పడిన వృక్షాలను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. మునిసిపల్ సిబ్బందితో డ్రైనేజీలు శుభ్రం చేయించారు. ఓని భాస్కర్ సేవలను స్థానికులు అభినందించారు.

## బాధితులకు బాసటగా భరోసా కేంద్రం

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం లైంగిక దాడులకు గురైన బాధితులను అక్కున చేర్చుకొని వారికి అండగా నిలుస్తోందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోద్కెన లైంగిక దాడుల కేసుల్లో బాధితులకు వైద్య సదుపాయం, వసతి, ఆర్థిక, న్యాయపరంగా సహకారం అందించడంతోపాటు నిందితులకు శిక్ష పడేవిధంగా కృషి చేస్తున్న భరోసా కేంద్రం అధికారులు, సిబ్బంది పనితీరును అభినందిస్తూ తెలంగాణ మహిళా భద్రత విభాగం అడిషనల్ డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ షీకాగోయెల్ జారీ చేసిన ప్రశంస పత్రాలను గురువారం సీపీ చేతుల మీదుగా భరోసా కేంద్రం అధికారులు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా భరోసా కేంద్రం సిబ్బందిని అభినందించారు. లైంగిక దాడులకు పాల్పడిన నిందితులకు శిక్షలు పడేలా చేస్తున్నందుకు వారిని కొనియాడారు. ఈ కేంద్రం సిబ్బంది ఇప్పటి వరకు 24 కేసుల్లో బాధితులకు బాసటగా నిలిచి నిందితులకు శిక్ష పడేలా కీలకంగా వ్యవహరించారన్నారు. అదే విధంగా 335 మంది బాధితులకు మొత్తం రూ.1.20కోట్లు పరిహారంగా అందజేయడంతో పాటు మరో ఎనిమిది మందికి రూ.14.16 లక్షల పరిహారాన్ని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి అందజేశారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రశంస పత్రాలు అందుకున్న వారిలో భరోసా కేంద్రం ఇన్ స్పెక్టర్ సువర్ణ, ఎస్సై శ్రావణి, ఇతర సిబ్బంది నీరజ, నవ్య, సాగరిక, సుమలత, రజిత, పవిత్ర, మౌనిక తదితరులున్నారు.



# శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవానికి తరలి రండి

### గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహానగరంలోని సుప్రసిద్ధ దేవాలయం తెలంగాణ శక్తి పీఠం శ్రీ భద్రకాళీ ఆలయంలో ప్రతి సంవత్సరం జరిగే శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా 18న శనివారం ఉ.9. గంటలకు తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ప్రపంచ నలుమూలల ఉన్న గౌడ కులస్తుల కుటుంబాల యోగ క్షేమాల కోసం ఈ కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని యాదగిరి గౌడ్ అన్నారు. డోలోత్సవం(ఉంజల్ సేవ ), సుగంధ పరిమళ ద్రవ్యాలతో నిత్యాహ్నికము, చతుస్థావార్చన, పుణ్యాహవచనం, హెూమం శ్రీ భద్రకాళీ అమ్మవారికి అంగరంగ వైభవంగా నిర్వహించబడును. కళ్యాణం అనంతరం భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్రంలోని గౌడ కులస్తులు, గౌడ నాయకులు, గౌడ ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, గౌడ కుల బంధవులు, గౌడ మేధావులు, గౌడ సోదరీసోదరమణులు, శ్రేయోభిలాషులు అందరూ ఈ కళ్యాణ బ్రహ్మోత్సవానికి హాజరై శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆశీస్సులు పొందగలరని రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్ ఒక ప్రకటనలో కోరారు.

## జీతాలు చెల్లించాలని కర్ణన్‌కు వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సందర్శించిన వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్.వి కర్ణన్ జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు అనగా (మార్చి, ఏప్రిల్) వేతనాలు వెంటనే చెల్లించాలని శుక్రవారం ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఆర్.బీ.ఎస్.కె. డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గుండా రవీందర్ ఏడు నెలల పీఆర్సీ ఏరియర్స్ ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై కమిషనర్ ఆర్ వి కర్ణన్ స్పందిస్తూ సాధ్యమైనంత త్వరగా జీతాలు చెల్లిస్తారని ఉద్యోగులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ బీఎస్ కే డాక్టర్స్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, మేనేజర్ మేర్గు అనిల్ కుమార్, ఎన్ హెచ్ఎం రాష్ట్ర ఎగ్జిక్యూట్ కమిటీ మెంబర్ నూర సంపత్ కుమార్, సైకాలజిస్ట్ ప్రశాంత్, ఫిజియోథెరపిస్ట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నను గెలిపించండి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** గత ప్రభుత్వ అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచడమే కాక, నిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా మారిన జర్నలిస్టు తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, లింగాల గణపురం జడ్పీటీసీ సభ్యుడు గుడి వంశీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వరంగల్-ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రశ్నించే ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్న విజయంకై నియోజకవర్గం లోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని సూచించారు.

## ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ గురువారం తెలిపారు. 14 సంవత్సరాలు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల మెరిట్, రిజర్వేషన్, వెబ్ ఆప్షన్‌ల ద్వారా సీట్ల భర్తీ ఉంటుందన్నారు. వెరిఫికేషన్ ఫీజు గేట్‌వే లింక్‌ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నెంబర్లకు సమాచారం అందించబడుతుందన్నారు.

# పట్టభద్రులంతా కలిసి ఎమ్మెల్సీగా గెలిపించండి

### బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, ఖమ్మం :** ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, విద్యావంతులు విజ్ఞతతో ఆలోచించి హక్కుల కోసం పోరాడే ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించేందుకు నిర్ణయం తీసుకోవాలని ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కోరారు. మీలో ఒక్కడిగా మీ అందరి ప్రతినిధిగా మీ గలాన్ని ప్రశ్నించడానికి శాసనమండలిలో మీ హక్కుల కోసం కొట్లాడే అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ లోని సీరియల్ నెంబర్ 03పై మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించి శాసనమండలి వేదికగా ఉద్యోగుల, నిరుద్యోగుల, యువత, విద్యావంతుల గొంతును వినిపించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం తెలంగాణ భవన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తాతా మధుసూదన్ నల్గొండ ఖమ్మం - వరంగల్ - పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డితో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాకేశ్ రెడ్డిని గెలిపించాలని ఖమ్మం జిల్లా పట్టభద్రుల ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఆశీస్సులు, కేటీఆర్ ప్రోత్సహంతో రాకేష్ రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో నియోజకవర్గం స్వమన్యయ కర్తలను నియమించామన్నారు. రాకేష్ రెడ్డి మంచి విద్యావంతులు.. అమెరికాలో పని చేస్తూ దేశం కోసం సేవా చేయాలని రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. చైతన్య వంతమైన ఖమ్మం జిల్లాలోని గ్రాడ్యుయేట్స్ మంచి వ్యక్తి, విద్యావతుండైన రాకెష్ రెడ్డిని వరంగల్, నల్లగొండ, ఖమ్మం విద్యావంతులు గెలిపించాలని కోరారు. వరంగల్ - నల్గొండ - ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు ఎన్నిక అనేది చాలా




ముఖ్యమని, చదువుకున్న వాళ్ళు, మేధావులు, విద్యావంతులు సమాజానికి ఉపయోగపడే వారిని ఎన్నుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆశీర్వాదం, ప్రజల ఆశీస్సులతో గెలుస్తానని, బీఆర్ఎస్ అభ్యర్థిగా నేను ప్రశ్నించే గొంతును, మా ప్రశ్న ప్రజల కోసం...ప్రజా సమస్యల కోసమేనని తెలిపారు. పెద్దలు, పట్టభద్రులు ఈనెల 27న జరిగే ఎన్నికలో 3 నెంబర్ పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, ఖమ్మం నియోజవర్గం పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జి ఆర్.జేసీ కృష్ణ, మధిర నియోజవర్గ పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జి బిచ్చల తిరుమల్ రావు, నగర పార్టీ అధ్యక్షుడు పగల నాగరాజు, కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, సుబ్బారావు, నరేందర్, ముత్యాల వెంకట అప్పారావు, సతీష్, ఆసిఫ్ హైమద్ సయ్యద్, బురఖాన్, తదితరులు పాల్గొన్నారు

## నలభైయ్యేండ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఖైదీ పట్టివేత



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నలభైయ్యేండ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఖైదీని మహబూబాబాద్ జైలు అధికారి వరంగల్ జైలు అధికారులతో కలిసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే 1982లో మహబూబాబాద్ లో జరిగిన ఓ హత్యకేసులో జీవిత ఖైదు శిక్షను అనుభవిస్తున్న కంబాలపల్లికి చెందిన 27ఏండ్ల సందుల వీరన్న 1984లో పెరోల్ పై విడుదల అయ్యాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జైలు అధికారుల కన్నుగప్పి మళ్లీ జైలుకు పోకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అయితే గతకొద్ది నెలలుగా జైలు అధికారులు తీవ్రంగా శ్రమించి తమకు వచ్చిన నమ్మదగ్గ సమాచారంతో దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారంలో శుక్రవారం పట్టుకున్నారు. మహబూబాబాద్ జైలర్ మల్లెల శ్రీనివాసరావు, వరంగల్ జైలు అధికారులు రామకృష్ణా రెడ్డి, బి.నాగరాజులు వార్డర్లు యాసిన్, రఘులు ఈ ఆపరేషన్ లో పాల్గొన్నారు. దాదాపు నలభైయ్యేండ్లుగా జైలు అధికారుల కన్నుగప్పి తిరుగుతున్న సందుల వీరన్నను 70ఏండ్ల వయస్సులో పట్టుకోవడంలో మహబూబాబాద్ సీఐ సర్వయ్య, దంతాలపల్లి ఎస్సై కరుణాకర్ పూర్తి సహకారం అందించారు. కాగా, నలభై ఏండ్ల కేసును ఛేదించిన జైలర్లను ఉన్నతాధికారులు అభినందించారు.

## జేసీబీతో చెత్తా చెదారం తొలగింపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డీకే నగర్ లో గురువారం రాత్రి వేళ కురిసిన వర్షం వల్ల రహదారి ప్రక్కనున్న ఇండ్లలోకి నీరు వచ్చినందున ఎస్ టీపీ వారు నిర్మించిన వాల్స్ దగ్గర మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జేసీబీతో చెత్తా చెదారం తొలగించడంతో నీరంతా వెళ్లిపోయిందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. డీకే నగర్ లో కచ్చా కాలువలో చెత్తా చెదారాన్ని జేసీబీ ద్వారా తొలగించడం జరిగిందన్నారు. కచ్చా కాలువలలో ఇష్టం వచ్చినట్టు అక్కరకు రాని వస్తువులను ఉంచరాదని ఆయన ప్రజలను కోరారు. మురుగు నీటి శుద్ధి కేంద్రం వారు పూర్తిస్థాయిలో కాలువల నిర్మాణం చేపట్టకపోవడం వలనే డీకే నగర్ వర్ష ప్రభావంలో మునిగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీకే నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుండే రాజు, ప్రధాన కార్యదర్శి పోలెపాక మల్లేశం ఉన్నారు.

# దగ్గు వెంకన్నకు ఘన నివాళి

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ బీజేపీ శక్తి స్థల్ వద్ద అమరుడైన దగ్గు వెంకన్న 33వ వర్ధంతిని ఏబీవీపీ పరకాల పట్టణ పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరుడైన దగ్గు వెంకన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డ దగ్గు వెంకన్న పరకాలలో ఏబీవీపీ విస్తరించేందుకు ఎంతో కృషి చేశారని, అలాంటి మహెూన్నతమైన వ్యక్తిని నరరూప హంతకులైన నక్సలైట్లు హత్య చేశారని, ఆయన ఒక్కడిని హత్య చేస్తే పరకాల లో జాతీయ వాదం ఆగిపోతుందకున్న నక్సలైట్లు భావించారు. కానీ, ఆయన హత్యతో పరకాలలో ఎంతోమంది జాతీయ వాదులు పెరిగారని గుర్తు చేశారు. ప్రతి రోజు పరకాల పట్టణ శాఖ వారిని స్మరించుకుంటుందని, ఆయన మా నుంచిశారీరకంగా దూరంగా ఉన్న ఆయన ఆశయాలు మాతోనే ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవునూర్ మేఘనాథ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతి లాల్, బెజ్జంకి పూర్ణ చారి, దగ్గు రాజేశ్వరరావు సీనియర్ నాయకులు దగ్గు విజేందర్ రావు మారేడు గుండ భాస్కరాచారి చందుపట్ల రమణారెడ్డి పట్టణ అధ్యక్షులు మార్త భిక్షపతి, ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, కుక్కల విజయ్ కుమార్, పోశెట్టి



శ్రీనివాస్, గండ్ర శ్రీనివాస్ రెడ్డి, మార్త రాజభద్రయ్య, చందుపట్ల రవీందర్ రెడ్డి, దంచనాల సత్యనారాయణ, మహ్మద్ గాలీఫ్, కోడెల లింగమూర్తి, కానుగుల గోపీనాథ్, ముత్యాల దేవేందర్, ఉడుత చిరంజీవి, వల్లభైన భద్రయ్య, రఘుపతి గౌడ్, పూర్వ ఏబీవీపీ నాయకులు పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా గుగులోత్ రాజునాయక్‌ను గెలిపించండి



**వరంగల్ వాయిస్, కేయూ :** వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విద్యారంగ సమస్యల, నిరుద్యోగుల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ప్రధాన ఎజెండాగా పాలకవర్గాలపై ప్రశ్నించే గొంతుకగా అనేక విద్యార్థి ఉద్యమాలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట నేపథ్యం కలిగిన కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నేత ఉన్నత విద్యావంతుడైన రాజునాయక్ గుగులోత్ మీ అందరి తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని రాజు నాయక్ తెలిపారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి దశ నుండే సామాజిక స్పృహ, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతూ సమాజంలో నూతన తరం నాయకత్వ స్థానంలోకి రావాలనే ఆకాంక్షతో తమ సమస్యల పరిష్కారానికి తామే పోరాడాలన్న స్ఫూర్తితో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ, లక్షలాది మంది ఉన్నత విద్య కలిగిన నిరుద్యోగ యువకుల పక్షాన వారి సమస్యల పరిష్కారానికై నిరంతర పోరాటాలు కొనసాగిస్తున్నానని అన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ యూనివర్సిటీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, అభివృద్ధికి నోచుకోలేదని, విద్యారంగం వారి ప్రాధాన్యత అంశంగా లేదన్నారు. చైతన్యవంతులైన వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టభద్రులారా! పట్టుదలతో ఏ స్వార్థం లేకుండా తమ సమస్యలను పరిష్కరించే, ప్రభుత్వాలను ప్రశ్నించే బలమైన యువ గొంతుకగా నన్ను శాసనమండలికి పంపగలరని కోరారు. తన సీరియల్ నంబర్ 50 పై మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్ కుమార్, పీడీ ఎస్ యూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కేయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యులు విజయ్ కన్నా, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ వేదిక కన్వీనర్ వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ గిరిజన శక్తి ఇంచార్జి బానోతు దేవేందర్, బహుజన దళిత సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల ప్రశాంత్, భద్ర, నరసింహ, ప్రదీప్, సురేష్ శ్రీనివాస్ తదితర గ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

### వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల మూలంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పోలీస్టేషన్ లో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్ననేపథ్యంలో రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షం కురుస్తున్న సమయంలో ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండాలన్నారు. ముఖ్యంగా చెట్లకింద, విద్యుత్ తీగలు ఉన్న పరిసరాల్లో ఉండకూడదని సూచించారు. రైతులు తమ పంటలను జాగ్రత్తగా కాపాడుకోవాలని, అందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం తడవకుండా సరిపడ పరదాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. వర్షాల మూలంగా రైతులు ఆందోళన చెందవద్దని, ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## పాములు బాబోయ్ పాములు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని కాశిబుగ్గలో పాములు సంచరిస్తున్నాయి. జనసంచారం ఉన్న ప్రాంతాల్లో, షాపుల వద్ద విపరీతంగా పాములు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా కాశిబుగ్గ సెంటర్ నుంచి పెద్దమూరు వద్ద పాములు సంచరిస్తున్నాయి. స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు

## ఆఫ్ లైన్ గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని గ్రూప్-1 (ప్రిలిమ్స్), సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్)-2024 పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్ లైన్ గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1 (ప్రిలిమ్స్) గ్రాండ్ టెస్టును హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్)-2024 ఆఫ్ లైన్ గ్రాండ్ టెస్టును ఈ నెల 23, 26, 28, 30, జూన్ 10, 12 తేదీల్లో హైదరాబాద్‌లోని సైదాబాద్ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ : 040-27077929, 24071178ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సమీక్ష




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యంగా గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంత కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ధరణి పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు, చేపట్టనున్న పనులు, పనులపై జిల్లాల కలెక్టర్లతో చర్చించారు. వాటి వివరాలను సీఎస్ ఆయా జిల్లాల కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈవో విద్యాలత, డీర్డీవో నాగ పద్మజ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, పౌర సరఫరా కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి నాగేశ్వర్ రావు, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మొలుగూరి దంపతుల వివాహ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక పరకాల పట్టణంలోని మొలుగూరి భిక్షపతి నివాసంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి చంద్రకళ- భిక్షపతి వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని దంపతులను పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరకాల పట్టణంలోని రాజకీయ రంగంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని మంచి పరిపాలన దిశలో పరకాల అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నో మంచి పనులు చేసి మొలుగురి చంద్రకళ - భిక్షపతి దంపతులు చిరకాలం ప్రజల మదిలో ఉంటారని అన్నారు. మనస్ఫూర్తిగా ఇలాంటి పెళ్లి రోజు వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు చెరుపెల్లి మొగిలి, ఒంటేరు వరుణ్, బొచ్చు జెమిని, ఒంటేరు రవికుమార్, బొచ్చు అనిల్, ఒంటేరు సుధాకర్, బొచ్చు సంపత్, బొచ్చు అఖిల్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలు ఇతర పార్టీలను విమర్శించడం తగదు

### బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని గ్యారెంటీ పథకాలన్నీ అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని, భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న అన్ని హామీలను నెరవేరుస్తామని ప్రజలకు హామీ ఇచ్చి మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు పరచలేక రాష్ట్రాన్ని మరింత అప్పుల్లోకి నెట్టి వేస్తూ ప్రజలపై భారాన్ని మోపుతూ అప్పుల కోసం బ్యాంకుల వద్ద తిరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ లీడర్లు ఇతర పార్టీలను విమర్శించడం సబబు కాదని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇండియా కూటమి ఏర్పరచుకొని ఎన్నికల్లో పాల్గొంటున్న కాంగ్రెస్ పార్టీ పంజాబ్, బెంగాల్లో మిత్రపక్షాలతో సఖ్యత లేక వారిపై పోటీ చేయడం ద్వారా మొత్తం కూటమి ఒకటేనని చెప్పడం ఎలా వీలవుతుందని ప్రజలు కాంగ్రెస్ కూటమిని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రైతులకు ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆ ఊసు ఎత్తకుండా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సన్న రకం ధాన్యాన్ని పండించిన వారికే బోనస్ ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ ముచ్చట ఎన్నికల ముందే చెప్పాల్సిందని, ప్రజల్ని మోసం చేసి ఓట్లు వేయించుకున్న తర్వాత ఇప్పుడు చెప్పడం విడ్డూరంగా ఉందని మహేందర్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుద్ధి తెచ్చుకొని ఇతర పార్టీలను విమర్శించడం మానుకొని వారు పార్టీలో జరుగుతున్న లొసుగులను సరిదిద్దుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు మహేందర్ రెడ్డి హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పోరాటం ఉధృతం చేస్తామని, గ్రామాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ నాయకుల్ని తిరుగనీయకుండా ప్రజలతో మమేకమై పోరాడుతామని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## అర్చరీ వేసవి శిక్షణ శిబిరం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** కల్లేడ ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్చరీ వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 20 నుంచి జూన్ 5వ తారీకు వరకు కొనసాగుతుందని ఆర్చరీ కోచ్ రేణు మండల్ తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా షూటింగ్, బాడీ పోస్టుర్, ఫిజికల్ ఆక్టివిటీ, ఇతర విషయాల గురించి అవగాహన కల్పించటం కోసం ఈ వేసవి శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. ఈ శిక్షణలో పాల్గొన్న బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి కల్పించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎ. జనార్దన్ తెలియజేశారు. మండలంలోని విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9959301913, 9989030018 నంబర్లలో సంప్రదించగలరని పేర్కొన్నారు.

## వీరారం తండాను సందర్శించిన డీఎంహెచ్ఓ బి.కళావతి భాయి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మల్యాల పీహెచ్ సీ పరిధిలోని వీరారం తండాను శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి. కళావతి భాయి ఆకస్మికంగా సందర్శించారు. వీరారం తండాలో ఆర్‌బీఎస కే బృందం ఎలా పనిచేస్తున్నారు. ఎలా పరీక్షించి మందులు, సలహాలు ఇస్తున్నారని పరిశీలించారు. తండాలో ఫ్రైడే డ్రై డే ను నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. వీరారం తండాలో తీవ్రమైన పోషకాహారం లోపంతో బాధపడుతున్న రెండుసంవత్సరాల అబ్బాయిని గుర్తించి వెంటనే ఎంజీఎంలోని ఎన్ఆర్సీ విభాగానికి మెరుగైన సేవల కోసం పంపించడం జరిగింది. మహబూబాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరధిలోని బెస్త బజార్ సబ్ సెంటర్ ను తనిఖీ చేశారు. సబ్ సెంటర్ సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్న సిబ్బందిని పరిశీలించి మరింత మెరుగైన సేవలు అందించడానికి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. అలాగే, ఈ వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల గురించి వివరించాలని సిబ్బందికి తెలిపారు. కావలసినన్ని మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ఎ.అంబరీష డిప్యూటీ డీఎంహెచ్ఓ, డాక్టర్ కుమార్, రమా పీడీఎంఓ, శ్రీనివాస్, ఎస్ యూఓ, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటా



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని చౌళ్లపెల్లి మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు కుక్కమూడి శ్రీనివాస్ తల్లి కుక్కముడి కొమురమ్మ దశదినకర్మకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి హాజరై నివాళులర్పించడంతో పాటు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న కార్యకర్తలను కాపాడుకుంటానని అన్నారు. మాజీ మండల అధ్యక్షుడు మాటేటి మహేందర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పూజారి రవి గౌడ్, ఓబీసీ మండల ప్రధాన కార్యదర్శి మోరే రాజేశ్వరరావు, పిసాల సాంబయ్య, ఆవులవెంకన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డీటీడీఓపై ఆరోపణలు అవాస్తవం

### బానోత్ సునీల్ నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమ కళా రెడ్డి పై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తమని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ సునీల్ నాయక్ నాయక్ అభిప్రాయపడ్డారు. తమ మాతృ సంస్థ అయిన గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గిరిజన ప్రజలకు, విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్నటువంటి గిరిజన సంక్షేమ శాఖ అధికారులపై లంబాడి హక్కుల పోరాట సంఘం పేరుతో వసూళ్లకు పాల్పడుతూ దురుద్దేశంతో బురద జల్లుతూ ప్రవర్తిస్తున్న కొంతమంది నాయకుల మాటలు నమ్మొద్దని సునీల్ నాయక్ హెచ్చరించారు. హనుమకొండ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమకళా రెడ్డి పై వస్తున్న ఆరోపణలపై సునీల్ నాయక్ ఘాటుగా స్పందిస్తూ లంబాడి హక్కుల పోరాట సమితి నుంచి తొలగించబడిన కొంతమంది సభ్యులు వ్యక్తిగత వసూళ్ల కోసం గిరిజన సంక్షేమ శాఖ అధికారులపై బురదజల్లే ప్రయత్నం చేయవద్దని, అలా చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## 2018 డిసెంబర్ 1 నుంచి రుణమాఫీ చేయాలి

### విజ్ఞప్తి చేసిన ధరణి రైతు సంక్షేమ సంఘం రైతులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2023 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొన్నింటిని అమలుపర్చి పార్లమెంటు ఎన్నికలకు వెళ్లిన విషయం తెలిసిందే. అలాగే ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెడతానని చెప్పడం ద్వారా 2018 డిసెంబర్ 1 నుంచి అప్పులు తీసుకున్న రైతులకు రుణమాఫీ పథకాన్ని వర్తింపచేయాలని ధరణి రైతు సంక్షేమ సంఘం పర్వతగిరి మండల రైతులు కోరుతున్నారు. ఇటీవల పలు పత్రికల్లో 2019 ఏప్రిల్ 1 నుంచి, 2023 డిసెంబర్ 10 లోపు అప్పులు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని వచ్చిన దానిపై, కొంత వెసులుబాటు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కీర్తిశేషులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేవలం ముగింపు తేదీ మాత్రమే ప్రకటించి, అంతకుముందు ఉన్న రైతుల పాత బకాయిలు మొత్తం రుణమాఫీ చేశారని, అలాగే అప్పులు చెల్లించిన రైతులకు కూడా ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున బోనస్ కూడా ఇచ్చారని, సీఎం రేవంత్ రెడ్డి రైతుల కోరికను మన్నించి నాలుగు నెలల సమయం వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రైతులకు ఎంత అప్పు తీసుకున్నా కానీ, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ధరణి రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొల్లూరి దేవేందర్, ప్రధాన కార్యదర్శి బక్కి రాజు, ఉపాధ్యక్షుడు బక్కి శ్రీనివాస్ సభ్యులు వర్దినేని కేశవరావు, కొల్లూరి వెంకటస్వామి, కొల్లూరి మల్లయ్య, ఎండీ యాకూబ్, బక్కి యాకయ్య, చిరుకొండ అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మరాయునిపాడు గ్రామ శతాబ్ది ఉత్సవాలు

### హాజరైన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలంలోని తిమ్మారాయనపాడు గ్రామం ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలలో నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా నుంచి పదిమందిగా వచ్చి రెండువేల ఎకరాల భూమిలో సేద్యం చేసుకుని ఈ ప్రాంతాల నుంచి ప్రపంచంలోని అనేక దేశాలలో పాస్టర్లుగా, మత బోధకులుగా, ఉద్యోగులుగా, ప్రజాప్రతినిధులుగా ఎదిగారని, ఏసుప్రభు దీవెనలతో ఈ ప్రాంతంలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. గత 40 సంవత్సరాల రాజకీయ చరిత్రలో నాకు చేదోడు వాదోడుగా సహకరించారని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ గ్రామంతో పాటు ఈ ప్రాంత ప్రజలకు సాధ్యమైన మేరకు సేవలందిస్తానన్నారు. అనంతరం మతబోధకులచే ఆశీర్వాదం పొందారు. గ్రామ పెద్దలు ఏర్పాటు చేసిన స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడోత్సవాలలో ప్రతిభను చాటిన క్రీడాకారులకు ప్రధానోత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు,నియోజకవర్గ నాయకులు, మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్, మండల నాయకులు, తిమ్మరాయని పహేడ్ గ్రామ పెద్దలు, మత బోధకులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** త్వరలో జరగబోయే ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ లు కోరారు. కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మావిడాల యశస్విని రెడ్డిల ఆదేశాల మేరకు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో కేసీఆర్ వరి వేస్తే ఉరి అని మాట్లాడారని, ఆనాడు రైతులు వరి పంట పండిస్తే పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు నేడు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలోనే రైతులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. ఆగస్టు 15 లోపు రైతులకు 2 లక్షల రుణమాఫీ అందుతుందన్నారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, 1వ వార్డు కౌన్సిలర్ భూసాని రాము, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోత్ రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు కందాడి అచ్చిరెడ్డి, నల్లమాస సమ్మయ్య, ధరావత్ సోమన్న, నల్లపు రాజు, దీకొండ మధు, సురేందర్, అరవింద్, రాంబాబు, మహబూబ్ రెడ్డి, జలగం వెంకన్న, కుమార్ యాదవ్, చంటి, వెలుగు మహేశ్వరి, తాటికాయలు రాణి, జాటోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పక్కా ప్లాన్‌తో అంగన్వాడీ టీచర్ హత్య

**అడవిలోకి తీసుకెళ్లి అత్యాచారం**
**తర్వాత గొంతుకు స్కార్ఫ్ చుట్టి మర్డర్**
**ఇద్దరు నిందితుల అరెస్టు**
**బంగారం నగలు, బైక్ స్వాధీనం**



**వరంగల్ వాయిస్, తాడ్వాయి :** తాడ్వాయి మండలం కాటాపూర్ అడవిలో జరిగిన అంగన్వాడి టీచర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అంగన్వాడి టీచర్ పై అత్యాచారం జరిపి ఆమెను హత్య చేసినట్లు గుర్తించారు. నిందితులను ఇద్దరిని కూడా అరెస్టు చేసినట్లు ప్రకటించారు. అరెస్ట్ అయిన నిందితుల నుంచి ఒక మోటార్ సైకిల్, మూడు తులాల బంగారం గొలుసు, పుస్తెలు, వృద్ధురాలు హ్యాండ్ బాగ్, అందులో ఉన్న బ్యాంక్ పాస్ బుక్స్, ఆధార్ కార్డును స్వాధీనం చేసుకున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటారం అడవిలో ఈనెల 14న అంగన్వాడీ టీచర్ రడం సుజాత హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యపై ములుగు డీఎస్పీ శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామంలో పనిచేస్తున్నారు. ఈనెల 14న కాటాపూర్ గ్రామంలో విధులను ముగించుకున్న అంగన్వాడీ టీచర్ చిన్నబోయినపల్లి గ్రామానికి వెళ్లేందుకు బయలుదేరారు. గ్రామంలో బస్సు మిస్ అవ్వడంతో అంతకుముందే పరిచయం ఉన్న ఆకుదారి రామయ్య తాను లిఫ్ట్ ఇస్తానని కాటాపూర్ గ్రామంలో ఆమెను బైకు ఎక్కించుకున్నాడు. అప్పటికే ఆకుదారి రామయ్య కాటాపూర్ సమీపంలోని అడవి వద్ద గల నీళ్ల ఒర్రె వద్ద పగిడి జంపయ్య అనే వ్యక్తిని బైక్ పై దించాడు. కాటాపూర్ నుంచి అంగన్వాడీ టీచర్ తో బైకు పై బయలుదేరిన ఆకుదారి రామయ్య అడవిలో నీళ్ల ఒర్రె వద్దకు ఆమెను తీసుకెళ్లాడు. అక్కడ ఆకుదారి రామయ్య, పగిడి జంపయ్య ఇద్దరు కలిసి అంగన్వాడీ టీచర్ ను అడవిలో కొద్ది దూరం తీసుకెళ్లారు. ఆమెపై అత్యాచారం జరిపారు. తర్వాత అంగన్వాడి టీచర్ మెడలో ఉన్న బంగారం గోపితాడును లాక్కునే ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించారు. ఆమె తలపై రాయితో కొట్టాడు. తర్వాత ఆ రాయిని నీళ్ల ఒర్రెలో పడేశాడు. ఆకుదారి రామయ్య ఆమె చాతిపై కూర్చుని గొంతు నొక్కాడు. తర్వాత ఇద్దరు కలిసి ఆమె స్కార్ఫ్ తో మెడ చుట్టూ ఇద్దరు కలిసి లాగి ఊపిరాడకుండా చేసి అంగన్వాడీ టీచర్ ను చంపారు. తర్వాత ఆమె మెడలోని మూడు తులాల బంగారం గొలుసు, పుస్తెలను తీసుకున్నారు. ఆమె మొబైల్ ఫోన్లని పక్కనే ఉన్న నీళ్ల ఒర్రెలో పడేశారు. ఆమె బ్యాగుని కూడా అడవిలో దూరంగా విసిరేశారు. తర్వాత ఆకుదారి రామయ్య, పగిడి జంపయ్యలు తమ స్వగ్రామమైన ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు వెళ్లారు. మృతురాలి కొడుకు రడం చరణ్ ఫిర్యాదు మేరకు తాడ్వాయి పోలీసులు విచారణ చేపట్టారు. పస్రా ఇన్ స్పెక్టర్ వంగపల్లి శంకర్, తాడ్వాయి ఎస్సై ననిగంటి శ్రీకాంత్ రెడ్డిల ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు సీసీ ఫుటేజీల, నిందితుల కాల్ డేటా ఆధారంగా పూర్తి ఆధారాలు సేకరించారు. శుక్రవారం నిందితులను ఇద్దరిని పట్టుకున్నారు. వీరిని పట్టుకోవడం, బంగారం రికవరీ, నిందితులు వాడిన వాహనం, రాయి, మృతురాలి వస్తువులను సీజ్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ఏఎస్ఐ చింత నారాయణ, హెడ్ కానిస్టేబుల్ కిషన్, హనుమాన్ పోలీస్ కానిస్టేబుళ్లు పూజారి రమేష్, జాజ సాంబయ్య, అప్పాల రమేష్, గోపు రాజీవ్, కాసగోని రాజేష్ లను ములుగు డీఎస్పీ అభినందించారు.

# జనం కోసం జనరల్ బోగీలు

## కోటి ఉత్తరాల విన్నపం




**వరంగల్ వాయిస్, గుంటూరు :** ప్రతి రైలులో సాధారణ భోగీ ల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదు సాధారణ భోగీల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సాధన సమితి జాతీయ కన్వీనర్, జాతీయఅవార్డు గ్రహీత-డాక్టర్ పరికిపండ్ల అశోక్ దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా గుంటూరు నుంచి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యక్రమాలను ప్రారంభించారు. ఐదు సాధారణ భోగీల సాధన కోసం ప్రధానమంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల గాంధీ మార్గంలో ఉద్యమాన్ని వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు అనధికార అంచనా ఉండగా, ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఆగమ్య గోచరంగా ఉంటుందన్నారు. సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అశోక్ పరికిపండ్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రవాణా వ్యవస్థగా ఉన్నటువంటి భారతీయ రైల్వేలు సాధారణ పౌరుడికి అందిస్తున్న సేవలు మాత్రం శూన్యంగా ఉన్నాయని మండిపడ్డారు. ప్రతి పేదవాడు విద్య, వైద్యం, ఆరోగ్యం, బంధువుల సందర్శన, అత్యవసర పనుల రీత్యా ఆశ్రయించేది సరసమైన ధరలో లభించేటువంటి రైలు నేనని తెలిపారు. కానీ, సౌకర్యాల పరంగా రైల్వేలు అందిస్తున్న సేవలు అగమ్య గోచరంగా ఉన్నాయని డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా-టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ-110011 చిరునామాకు మన బాధను, డిమాండ్ ను అభిప్రాయాల్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని, అంతేకాకుండా ప్రతి ఒక్కరూ వారి మిత్రులు, బంధువుల ద్వారా ఒక్కొక్కరు 100 మందితో రాయించాలని పోస్ట్ చేయాలని, ఈ విషయాన్ని వందమందికి వాట్సప్ గ్రూపులలో షేర్ చేయాలని, అంతేకాకుండా ఏ%ూమీ×అ౧ఱు%కు ట్విట్టర్ ఖాతాలో %శ%ద్వారా ట్వీట్ చేయాలని కోరారు. వివరాలకు 9989310141లలో సంప్రదించాలని తెలిపారు. గుంటూరు నుండి ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యక్రమాలకు సామాజికవేత్తలు చిలువేరు గణేష్, మూషం అనంత రాములు సమన్వయకర్తలుగా వ్యవహరించగా నగరంలోని పలు ప్రాంతాల్లోని వాకర్స్ అసోసియేషన్లు, ఎన్టీఆర్ స్టేడియం, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో గల ప్రజలు, విశ్రాంత ఆచార్యులు, పుర ప్రముఖులు ఉత్తరాల కార్యక్రమానికి మద్దతు తెలిపి ఉత్తరాలు రాసి పంపారు.

## డిఫాల్టర్ మిల్లర్లతో కలెక్టర్ సమీక్ష



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలు లో శుక్రవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ,అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ గార్లు డిఫాల్టర్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో 2021-21 రబీ కాలానికి సంబంధించిన మిల్లులు డిఫాల్ట్ కావడం వలన, వారు కట్టవలసిన (25శాతం) పెనాల్టీకి సంబందించి బ్యాంకు గ్యారంటీ కట్టమని ఆదేశించారు. జిల్లాలో వడ్లు కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత మిల్లర్లకుకి సూచించారు. అకాల వర్షాల నుంచి ధాన్యం తడవకుండా జాగ్రత్త పడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 2023-24 సంబందించిన సీఎంఆర్ డెలివరీస్ ను వేగవంతం చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎం సివిల్ సప్లయ్ కృష్ణవేణి, సంబంధిత అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

## రక్తదానంతో తలసేమియా బాధితులకు పునర్జన్మ ఇవ్వచ్చు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రక్త కేంద్రంలో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని, 18 సంవత్సరాలు నిండిన రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపు మేరకు శుక్రవారం తన పుట్టిన రోజు సందర్భంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన రక్తదాత రాసమల్ల అఖిల్ (పర్వతారోహకుడు) ను రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి సర్టిఫికెట్ అందచేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంతో తలసేమియా బాధితులకు పునర్జన్మ ఇవ్వొచ్చన్నారు. తలసీమియా చిన్నారులకు నిత్యం రక్తం అవసరముంటుందని, యువత స్వచ్ఛందగా రక్త దానానికి ముందుకు వచ్చి రక్తదానం చేసి తలసేమియా బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు కన్నె రాజు, రాసమల్ల హారిక, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ రికార్డుల ప్రకారం నాలా సర్వే నిర్వహించండి

## బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రెవెన్యూ రికార్డుల ప్రకారం నాలా సర్వే నిర్వహించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం నయీం నగర్ నాలాను కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి కొనసాగుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నాలా కు ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సి ఉన్నందున 3-4 రోజుల్లో ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ వారు ప్రెసిడెన్సీ స్కూల్ నుంచి డబ్బాల బ్రిడ్జి వరకు రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే పూర్తి





చేయాల్సిన అవసరం ఉందని, సర్వే పూర్తైన తర్వాత రిటైనింగ్ వాల్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపిన కమిషనర్, ఇందుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. నాలా హద్దులకు చెందిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు ఈ పరిధిలో ఉన్న కోర్టు కేసుల గురించి టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, ఆర్డీఓ దత్తు, డీడీసీపి ప్రకాష్ రెడ్డి, బల్దియా ఈఈ రాజయ్య, ఇరిగేషన్ ఈఈ ఆంజనేయులు, ఇరిగేషన్ డీఈఈ హర్షవర్ధన్, హనుమకొండ తహసీల్దార్ విజయ్ కుమార్, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని రాంపూర్ లో గల చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ సైన్సెస్ లో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న ఎల్.శ్రీకాంత్ కు రాజస్థాన్ లోని కెరీర్ పాయింట్ యూనివర్సిటీ డాక్టరేట్ ను ప్రకటించింది. "సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూవేషన్ ఆఫ్ నావెల్ బెంజిమిడజోల్ స్కాఫోల్డ్ బియరింగ్ డెరివేటివ్స్ ఆస్ పోటెంట్ ఆంటీక్యాన్సర్ డ్రగ్స్" అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రీకాంత్ కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ప్రొఫెసర్ పాశం వెంకన్న పర్యవేక్షణలో శ్రీకాంత్ పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నాకు సహకరించిన ఉపాధ్యాయులకు, కుటుంబ సభ్యులకు, మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## తీన్మార్ మల్లన్నకు లాయర్లు మద్దతు ఇవ్వాలి

### కాంగ్రెస్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని హనుమకొండ కోర్టు ఆవరణలో న్యాయవాదులను జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కలిసి కోరారు. రామకృష్ణ మాట్లాడుతూ ఒక ప్రశ్నించే గొంతుకకు శాసన మండలికి పంపిస్తే మన గొంతుకై ప్రశ్నిస్తాడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మన కష్టాన్ని వివరించి మనకు న్యాయం జరిగేలా చేసే వ్యక్తి తీన్మార్ మల్లన్న అని తెలిపారు. అలాంటి తీన్మార్ మల్లన్నను ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు మాజీ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరావు గొంతు ఎత్తి ఏనాడు మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూర్చోమంటే కూర్చోవడం నిలబడమంటే అంటే నిలబడడం ఇదే జరిగింది. గత ప్రభుత్వం 10 సంవత్సరాల చేసిన అన్యాయాలు అక్రమాలకు మన అనుభవించిన బాధలను కష్టాలను తీర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, తీన్మార్ మల్లన్నను ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో వరంగల్ ఖమ్మం నల్గొండ ప్రజలు గెలిపిస్తారని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆశభావం వ్యక్తం చేశారు.

## న్యాయవాదులను కలిసిన రాకేశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఖమ్మం :** ఖమ్మం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి అభ్యర్థించడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి, వాటిపై సమాలోచన చేశారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పట్టభద్రుల ఎన్నికల ఖమ్మం నియోజకవర్గ ఇంచార్జి ఆర్ జేసీ కృష్ణ ఉన్నారు.

# ప్రశ్నించే గొంతుక రాకేశ్ రెడ్డి






- గడ్డం కేశవమూర్తి

**ఎమ్మెల్సీ ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్**

**సిట్టింగ్ స్థానాన్ని గెలిచేందుకు కసరత్తు**

**రంగంలోకి కేసీఆర్, కేటీఆర్**

**గెలుపే లక్ష్యంగా కారు జోరు**

వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎనుగుల రాకేశ్ రెడ్డిని బరిలో నిలిపింది. మొదట్లో కొంత అసమ్మతి నెలకొనప్పటికీ స్వయంగా బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోక్యం చేసుకోవడంతో అంతా సద్దుమణిగింది. ప్రశ్నించే గొంతుక, ఉన్నత విద్యావంతుడు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే రాకేశ్ రెడ్డి తన విజయంపై సంపూర్ణ నమ్మకంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో మిస్సైల్ మాదిరి దూసుకెళుతున్నారు. దీంతో రాకేశ్ రెడ్డి గెలుపు సునాయాసంగా మారింది.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఏనుగుల రాకేశ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. తన గెలుపు కోసం సరైన పోల్ మేనేజ్ మెంట్ నిర్వహిస్తున్నారు. పట్టభద్రులతో ములాఖత్ అవుతూ తన గెలుపుకు బాటలు వేస్తున్నారు. అయితే వరంగల్- ఖమ్మం- నల్గొండ జిల్లాల్లో ఎన్నికల తీరుపై పార్టీ అధిష్ఠానం ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తోంది. ప్రశ్నించే గోంతుకను శాసనమండలికి పంపించడంద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ పట్టభద్రులను చైతన్యవంతులను చేస్తోంది. రాకేశ్ రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగుల సమస్య పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తారంటూ పేర్కొంటున్నారు.

## ఛాలెంజ్‌గా తీసుకున్న బీఆర్ఎస్..

వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను బీఆర్ఎస్ పార్టీ ఛాలెంజ్ గా తీసుకుంది. ఎట్టి పరిస్థితుల్లో సిట్టింగ్ స్థానాన్ని వదులుకోకూడదని ఆ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గెలుపు కోసం తీవ్ర కసరత్తు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి వారి వైఫల్యాలపై పట్టభద్రులకు వివరిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డి గెలుపు కోసం పట్టభద్రులను చైతన్య పరుస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. యువత అంతా బీఆర్ఎస్ వైపే ఉన్నందున విద్యావంతుడు, యువకుడైన రాకేశ్‌రెడ్డిని గెలిపించేందుకు తీవ్రంగా కృషి చేయాలని సూచిస్తున్నారు.

## అంతా సర్దుకుంది..

రాకేశ్ రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కష్టపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించి అందరూ కలిసి పనిచేయాలని సూచించడంతో నేతలంతా కదనరంగంలోకి దిగారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపును ఎవరూ ఆపలేరంటూ ప్రచారాలు నిర్వహిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైతం రాకేశ్ రెడ్డి గెలుపు కోసం తీవ్రంగా పనిచేస్తున్నారు. ఎలాగైతే తన గెలుపు కోసం పనిచేశారో రాకేశ్ రెడ్డి విజయం కోసం అదే విధంగా కృషి చేయాలని పట్టభద్రులను కోరుతున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆయన గెలుపే లక్ష్యంగా తీవ్రంగా కృషి చేస్తున్నారు.



## ఉన్నత విద్యావంతుడు..

సాధారణ రైతు కుటుంబానికి చెందిన రాకేశ్ రెడ్డి ప్రసిద్ధి గాంచిన బిట్స్ పిలానీ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ మేనేజ్ మెంట్ స్టడీస్, మాస్టర్స్ ఫైనాన్స్ డిగ్రీ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించారు. తన ప్రతిభతో చిన్న వయసులోనే బెంగళూర్ సిటీ బ్యాంక్ మేనేజర్ గా, జేపీ మోర్గాన్ లాంటి బడా కంపెనీలో బెంగళూరు, అమెరికాలో దాదాపు ఏడేళ్ల పాటు పని చేశారు. ఆ తరువాత ఫేస్ బుక్ కంపెనీలో కొద్దిరోజులు పని చేశారు. కరోనా కష్టకాలంలో, వరంగల్ వరదల సమయంలో ఎంతోమందికి ఆహారం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 'రాకేశ్ రెడ్డి ఈ క్లాసెస్'యాప్ ను తీసుకొచ్చి ఆన్ లైన్ తరగతులు నిర్వహించారు. జాబ్ మేళాలు నిర్వహించి 500 మందికిపైగా యువతకు ఉపాధి చూపారు.

## ఇద్దరి మధ్యే పోటీ !

ఈ నెల 27 న పోలింగ్ జరగనుండడంతో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డితో పాటు మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధానంగా పోటీ ఉండనుంది. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్ రెడ్డి బిట్స్ ఫిలాని స్టూడెంట్ గా పేరుంది. అంతే కాకుండా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. అంతే కాకుండా బీఆర్ఎస్ లో పల్లా వర్గంగా పేరుంది. అధికూడా రెడ్డి రాకేష్ రెడ్డి గెలుపుకు దోహదపడనుంది. అంతేకాకుండా బీజేపీ నుంచి ఒక వర్గం ఓట్లు రాకేష్ రెడ్డికి పోలయ్యే అవకాశం లేకపోలేదు. దీంతో రాకేశ్ రెడ్డి గెలుపు నల్లేరుపై నడకగా మారింది.














# హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

**నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయండి**

**వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో**

**పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఆ శాఖ కమిషనర్, టీఎస్ఎంఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ వి.కర్ణన్, జాయింట్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టర్ పి.ప్రావీణ్యలతో కలసి నగరంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల ప్రగతిని సమీక్షించారు. నగరంలోని ఎంజీఎం, ప్రభుత్వ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ సీకేఎం ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ టీబీ ఆసుపత్రులలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న విభాగాలు, ఉపస్థితిలో ఉన్న ఈక్విప్ మెంట్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోకి మార్పు చేసే విభాగాలు తదితర అంశాలను ఆయా ఆసుపత్రుల పర్యవేక్షకులతో కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో అధికారులతో కలిసి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎంజీఎం ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, పిడియాట్రిక్ విభాగాలను, కేఎంసీలోని పీఎంఎస్ ఎస్ వై ఆసుపత్రి క్యాథ్ ల్యాబ్, డయాలిసిస్ విభాగాలను సందర్శించి ఎక్విప్ మెంట్, అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్ రెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఎస్ ఈ దేవేందర్, ఎంజీఎం, ప్రభుత్వ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ సీకేఎం ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ టీబీ ఆసుపత్రుల పర్యవేక్షకులు చంద్రశేఖర్, నిర్మల, విజయలక్ష్మి, శ్రవణ్, గిరిధర్, సీకేఎం ప్రిన్సిపల్ మోహన్ దాస్, వైస్ ప్రిన్సిపల్ రాం కుమార్ రెడ్డి, ఎల్ అండ్ టి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అశ్వ వాహనంపై అమ్మవారి ఊరేగింపు

**ఎనిమిదో రోజుకు చేరిన కళ్యాణ బ్రహ్మోత్సవాలు**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ మహా నగరంలో పరమ పావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం 4 గంటలకు నిత్యనికం పూర్తిచేసి చతుస్థానార్చన జరిపి తదుపరి అమ్మవారికి డోలోత్సవం నిర్వహించారు. ఉదయం భద్రపీఠ సేవ, సాయంకాలం అశ్వవాహన సేవపై అమ్మవారిని ఊరేగించారు. ఉభయ దాతలుగా కమ్మ సేవా సంఘం ప్రతినిధులు వ్యవహరించారు. కమ్మ సంఘం అధ్యక్షుడు మందడి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గంగవరపు రామకృష్ణ ప్రసాద్ తోపాటు అనేకమంది అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు, పూజా ద్రవ్యములు అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి షోడశోపచార పూజ జరిపి అమ్మవారి అనుజ్ఞతో స్నపన మండపంలోకి ప్రవేశించి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. తదుపరి నారీమణులచే అమ్మవారికి కుంకుమార్చన, హెూమం తర్వాత డోలోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ ఈవో శేష భారతి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం ఉపాధ్యక్షులు కూనాటి హరిబాబు, దనేకుల రాంబాబు, దొడ్ల పోలయ్య, ముప్పసాని అనిల్ కుమార్, త్రిపురనేని గోపీచంద్, డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ఇక బీజేపీ ప్రభుత్వమే

**పట్టభద్రుల ఓట్లతోనే దానికి నాంది**

**కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకట రమణ రెడ్డి**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని దానిని పట్టభద్రుల ఓట్లతోనే నాంది పలకాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకట రమణ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్ విష్ణుప్రియ గార్డెన్స్ ఎదురుగానున్న నల్గొండ – వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కార్యాలయంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే విజయం అన్నారు. గ్రాడ్యుయేట్లు తమ బంగారు భవిష్యత్ కోసం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. విద్యావంతులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ ప్రబారి డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, ములుగు జిల్లా అధ్యక్షులు బలరాం, పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సీతారాం నాయక్, నాయకులు శ్రీధర్, ఎడ్ల అశోక్ రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, పులి సర్రోత్తం రెడ్డి, డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్‌లో..**

దేశాయిపేట్ రోడ్డులోని కేఆర్ గార్డెన్స్ ఎదురుగానున్న భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథఇగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట్ రమణ రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ నెల 27 న జరుగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రధ్యానం ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలు, జిల్లా నాయకులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభారీలు గంగిడి కృష్ణా రెడ్డి, పీఎల్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎర్రగొల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, తూర్పు నియోజకవర్గం కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, ఉపాధ్యక్షులు ఎరుకుల రఘునరెడ్డి, కాసు శిల్ప, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కందిమల్ల మహేష్, మార్టిన్ లూథర్, మాదాసు రాజు, తాబేటీ వెంకట్, గోకె వెంకట్, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, బూత్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

# పంచాయతీ సమరానికి వేళాయే..

**ఆగస్ట్ మొదటి వారంలో ఉండే అవకాశం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. దీనిపై అధికారులు కసరత్తులు ప్రారంభించారు. రాష్ట్రంలో మొత్తం 12,814 గ్రామ పంచాయతీలతోపాటు 88,682 వార్డులకు ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు రెడీ అవుతున్నారు. లోక్ సభ ఎన్నికలు పూర్తి కావడంతో అధికారులంతా పంచాయతీ ఎన్నికల్లో నిమగ్నమైనట్లు సమాచారం. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో అది పూర్తి కాగానే జూన్ మొదటి వారంలో వార్డుల విభజన చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రెండో వారంలో రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడో వారంలో రిజర్వేషన్ ప్రక్రియ ఉండనుంది. పంచాయతీ ఎన్నికలకు జులై మొదటి వారంలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముందని చెబుతున్నారు. చివరి వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం ఆగష్టు 2వ తేదీ లోపు ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ఆగస్టు మొదటి వారంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com